క్లుప్తంగా

శ్రీకృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



కొత్తకోట: పట్టణంలో నిత్యం ధూపదీప నైవేద్యాలతో పూజలు అందుకుంటున్న శ్రీకృష్ణ పరమాత్ముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం జరిగి 41 రోజులు పూర్తయినందున ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజనలు చేసి అన్న ప్రసాద వితరణ చేశారు.

హనుమాన్ ఆలయానికి రూ.3 లక్షల విరాళం



ఆత్మకూర్: మండలంలోని పిన్నంచర్లలో నూతనంగా చేపడుతన్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన దివంగత ముద్దయ్యశెట్టి కుమారులు బసయ్య, శ్రీనివాసులు, నరేష్ రూ.12.50 లక్షలు విరాళం ప్రకటించి.. మొదటి విడతగా రూ.3 లక్షలను కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, మచ్చేందర్‌గౌడ్, గ్రామపెద్దలు మాసన్న, ఖాజన్న, హరీశ్‌గౌడ్, రాములు, పూజారి యంకోబురావు తదితరులు ఉన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి..



కొత్తకోట: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప క్షేత్రం ఆలయ నిర్మాణానికి కొత్తకోట పట్టణ వాస్తవ్యులైన గుడిబండ విమల నరోత్తమ్‌రెడ్డి దంపతులు రూ. 2,51,116లు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ మొత్తం విరాళాన్ని ఆలయంలోని గర్భాలయ పిల్లర్ నిర్మాణం కోసం దాతలు అందజేశారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అయ్యప్ప సేవా సమితి సభ్యులు ధూపం నాగరాజు, బలిజ లింగేశ్వర్, విశ్వనాథం గంగాధర్, వేముల సుధాకర్‌రెడ్డి, సత్యం సాగర్, కిషోర్ దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

మోడల్ ఇందిరమ్మ ఇంటి పరిశీలన




ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇంటిని బుధవారం హౌసింగ్ డీఈ విఠోబా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నిర్మించే ఇందిరమ్మ ఇంటి నమూనలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణం ఎలా పూర్తవుతుందని చాలామంది సందిగ్ధంలో ఉన్నారని, ఈ నమూనాతో ఇంటిని నిర్మించుకోవడం వలన తక్కువ ఖర్చు అవుతుందన్నారు.

బాధితులకు చేయూత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన నక్క అంజమ్మ గుడిసె ఇటీవల విద్యుదాఘాతంలో దగ్ధమైంది. గొర్రెలను కొనుగోలు చేసేందుకు అప్పుగా తీసుకొచ్చి ఉంచిన రూ.2లక్షలు, ఇంటి సమాగ్రి పూర్తిగా కాలిబూడిదయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న వనపర్తి రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు బుధవారం హైదరాబాద్ రెడ్‌క్రాస్ సంస్థ చైర్మెన్ ఆలే శ్రీనివాసులు సహకారంతో నూతనంగా గుడిసె నిర్మించుకునేందుకు బాధితులకు 2 టార్పాలిన్ కవర్లు, వంట సామగ్రి, దుప్పట్లు, టవల్స్ అందించారు. కార్యక్రమంలో అహ్మద్, సీహెచ్ఓ భాస్కర్, సూపర్‌వైజర్ మహేష్, ఓంప్రకాష్, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్, భారతి, గ్రామస్తులు గొని బాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నక్క కురుమూర్తి తదితరులు ఉన్నారు.

పట్టుకున్నారు.. వదిలేశారు



అమరచింత: మండల కేంద్రంలోని చింతలకుంట నుంచి అనుమతి లేకుండా మొర్రం మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను ఎస్‌బీ పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మట్టి ట్రాక్టర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించిన కొద్ది సేపటికే వాటిని వదిలేశారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మట్టి మాఫీయాపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులే.. మట్టి తరలింపును ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యువ వికాసం.. ఉపాధికి సోపానం

- దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 5 చివరి తేదీ
- రద్దీగా మారిన మీసేవ కేంద్రాలు



రాజీవ్ యువ వికాసం పోర్టల్



పాన్‌గల్‌లోని మీసేవ కేంద్రాల వద్ద బారులు తీరిన జనం

పాన్‌గల్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి 'రాజీవ్ యువ వికాసం' పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 18 నుంచి 35 ఏళ్ల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం రాయితీ రుణాలు పంపిణీ చేయనుంది. మూడు కేటగిరీల్లో అర్హతలను బట్టి ఒక్కో నియోజకవర్గానికి నాలుగు వేల నుంచి ఐదు వేల మంది యువతకు లబ్ధి చేకూరేలా ప్రణాళిక రూపొందించింది. కొన్నేళ్లుగా స్వయం ఉపాధి రుణాల పంపిణీ నిలిచిపోవడంతో నిరుద్యోగులు డబ్బుల్లేక సొంతంగా వ్యాపారం చేయడానికి ముందుకు రాలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం ద్వారా అవకాశం కల్పిస్తుండటంతో.. వారిలో మళ్లీ ఆశలు చిగురించాయి. కానీ దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన కులం, ఆదాయ ధ్రువపత్రాల కోసం కూడా రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు.

రేషన్‌కార్డులో ఒక్క సభ్యుడికే..

ఒక రేషన్‌కార్డులో ఒక సభ్యుడికి మాత్రమే ఆర్థికసాయం పొందే అవకాశం ఉంటుంది. గతంలో ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం పొందిన వారు దరఖాస్తులను వెబ్‌సైట్ తీసుకోవడం లేదని, ప్రభుత్వం సహాయం పొంది ఏడేళ్ల లోపు అయిన లబ్ధిదారుల దరఖాస్తులు నమోదు అయ్యే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. రేషన్ కార్డులో ఒక్క సభ్యుడికే అవకాశం అంటుండటం, కొందరికి రేషన్ కార్డులు లేకపోవడం, మరికొందరూ ఉమ్మడిగా ఉండటంతో చాలా మంది దరఖాస్తు చేసేందుకు ముందుకు రావడం లేదు.

మూడు విభాగాలుగా..

అర్హత కలిగిన వారు మీసేవ కేంద్రం, ఫోన్లలో tgobmmsnew.cgg.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకొని రేషన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల వివరాలతో పాటు పాన్ నెంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. సంబంధిత వ్యక్తి ఫొటో అప్‌లోడ్ చేయాలి. ఎంచుకున్న రంగాన్ని బట్టి మూడు విభాగాలుగా రుణాలు అందిస్తారు. మొదటి విభాగంలో రూ. లక్షకు 80 శాతం రాయితీ, మిగిలిన 20 శాతం బ్యాంకు రుణం ఇస్తుంది. రెండో విభాగంలో రూ.2 లక్షలకు 70 శాతం రాయితీ, 30 శాతం బ్యాంకు రుణం, మూడు కేటగిరీలో రూ. 3 లక్షలకు 60 శాతం రాయితీ పోను మిగిలింది బ్యాంకు నుంచి అందిస్తారు.

ఆఖరి తేదీ..

దరఖాస్తులు 5 ఏప్రిల్ 2025 వరకు స్వీకరించి ఏప్రిల్ 6 నుంచి మే 31వ తేదీ వరకు పరిశీలన చేస్తారు. జూన్ 2వ తేదీ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు లబ్ధిదారులకు ఆర్థికసాయం అందించనున్నారు.

పారదర్శకత పాటించాలి



రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతను పాటిస్తూ అర్హులైన పేద కుటుంబాల నిరుద్యోగులకు అవకాశం కల్పించాలి. వ్యాపారం చేసుకొని ఉపాధి పొందే వారికే ప్రాధాన్యత ఇవ్వాలి. కొందరూ ప్రభుత్వ రాయితీ పొందడానికి మాత్రమే దరఖాస్తులు చేసుకుంటున్నారు.

– బాల్యానాయక్, సీపీఎం మండల కార్యదర్శి, పాన్‌గల్

పక్షపాతం చూపొద్దు



రాజీవ్ యువ వికాసం పథకంలో అధికారులు ఏమాత్రం పక్షపాతం చూపకుండా క్షేత్ర స్థాయిలో అర్హులను గుర్తించాలి. వ్యాపారం చేసుకుంటూ ఉపాధి పొందే వారికే అవకాశం కల్పించాలి.

– ఆంజనేయులు, డివైఎఫ్ఐ నాయకులు, రేమద్దుల

దరఖాస్తుల స్వీకరణ

రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 5వ తేదీ వరకు స్వీకరిస్తారు. ఆర్థిక సాయంపై విధివిధానాలు ప్రభుత్వం నుంచి అందలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేస్తాం.

– గోవింద్‌రావు, ఎంపీడీఓ, పాన్‌గల్

50 శాతం రాయితీపై వ్యవసాయ సామగ్రి

పాన్‌గల్: మహిళా రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ ఉప మిషన్ (ఎస్ఎంఏఎం) పథకం ద్వారా 50 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏడీఏ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు, మాన్యువల్ స్ప్రేయర్లు, పవర్, తైవాన్ స్ప్రేయర్, రోటవేటర్లు, కల్టివేటర్, ఎంబీ ప్లగ్, డిస్క్ హరోలు, పవర్ టిల్లర్ అందుబాటులో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. రాయితీపై పనిముట్లు పొందడానికి భూమి పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను దరఖాస్తు ఫారంతో కలిపి ఆయా గ్రామాల ఏఈఓలకు అందజేయాలని కోరారు. మహిళల పేరు మీదు భూమి ఉన్న రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను ఈనెల 28వ తేదీ లోగా అందజేయాలన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాటం

గోపాల్‌పేట: అణగారిన వర్గాల కోసం విశారధన్ మహారాజ్ చేస్తున్న పోరాట స్ఫూర్తి ఎంతో గొప్పదని, రాబోయే రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలదే రాజ్యాధికారం కాబోతోందని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరపాగ రామకృష్ణ మహారాజ్, మండల అధ్యక్షుడు గందం నాగరాజు అన్నారు. బుధవారం కోదండ రామస్వామి ఆలయం వద్ద ధర్మసమాజ్ పార్టీ నాయకులు సమావేశమయ్యారు. రాబోయే రోజుల్లో విశారధన్ మహారాజ్ తీసుకోబోయే నిర్ణయాలు మండల స్థాయిలో ప్రజలను ఎలా చైతన్యం చేయాలనే విషయాలను చర్చించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ మండల సభ్యులకు సన్మానించారు.

కొళాయి తాగునీటిలో పురుగులు

- సంప్‌హౌజ్ వద్ద గ్రామస్తుల ఆందోళన



పురుగులు ఉన్న నీటి బాటిళ్లను చూపుతున్న నందిమళ్ల గ్రామస్తులు

అమరచింత: కొళాయిల ద్వారా సురక్షితమైన తాగునీటిని అందిస్తున్నామని ప్రకటించడమే తప్పా.. క్షేత్రస్థాయిలో సరఫరా అయ్యే తాగునీటిలో పురుగులు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని నందిమళ్ల గ్రామస్తులు బుధవారం సంప్‌హౌజ్ వద్ద ఆందోళనకు దిగారు. గ్రామంలో బుధవారం తాగునీటిని కొళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీటిలో పురుగులు వస్తుండటం గమనించిన గ్రామస్తులు విషయాన్ని అదే గ్రామంలో ఉన్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ప్రజలతో కలిసి పీజేపీ నందిమళ్ల క్యాంప్ కాలనీలో ఉన్న సత్యసాయి పంప్‌హౌజ్‌కు వెళ్లి అధికారులు, సిబ్బందిని నిలదీశారు. వాటర్ ట్యాంక్‌ను పరిశీలించి శుభ్రపరుస్తామని, ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని అధికారులు చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మస్తాన్‌రాజు, శ్రీకాంత్, భాను, ప్రకాష్, చరణ్, సంజీవ్, అరుణ్ పాల్గొన్నారు.

'పేదలకు ఇంటి స్థలాలు చూపించాలి'




అమరచింతలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

వనపర్తి రూరల్: రామోజీ ఫిలిం సిటీలో పేదలకు కేటాయించిన భూములను వెంటనే వారికి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి శివారులోని సర్వే నంబర్ 189, 203 లో 577 మందికి ఇళ్ల పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ భూములను రామోజీ ఫిలిం సిటీ యజమాన్యం కబ్జా చేసి, పేదలకు మరోక చోట భూములు కేటాయిస్తామని నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. ఏళ్లు వేచి చూసినా పేదలు తమకు కేటాయించిన భూముల మీదకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడాన్ని సీపీఎం వనపర్తి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. భూములను కబ్జా చేసిన వారిని వదిలేసి, పేదలకు కేటాయించిన భూమిని వారికే ఇవ్వాలని పోరాటం నిర్వహిస్తున్న సీపీఎం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జాన్‌వెస్లీని, సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, ఇతర నాయకులపై దాడులు చేసి అరెస్టు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం రామోజీ ఫిలిం సిటీ యజమాన్యంతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. అరెస్టు చేసిన సీపీఎం నాయకత్వాన్ని, పేదలను బేషరత్‌గా విడుదల చేయాలని కోరారు.

అక్రమ అరెస్టులు సరికాదు

అమరచింత: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని పట్టణంలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జీఎస్.గోపి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా పరిధిలోని రామోజీ ఫిలిం సిటీలో పేదలకు ఇచ్చిన భూములను పేదలకు పంచాలని పలుమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. దీంతో పేదలకు మద్దతుగా బుధవారం చలో రామోజీ ఫిలిం సిటీ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ శాంతియుతంగా నిరసన తెలపగా.. పోలీసులు లాఠీ చార్జ్, అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో వెంకటేష్, రాజు, అజయ్, ఆర్ఎస్.రమేష్, మాజీ సర్పంచ్ గోపాల్, శ్యాంసుందర్‌లు పాల్గొన్నారు.

'రేషన్‌కార్డు నిబంధన తొలగించాలి'



తహసీల్దార్ కు వినతి పత్రాన్ని అందిస్తున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం పేరుతో నిరుద్యోగ యువకులను దగా చేస్తుందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ అన్నారు. రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తు చేసుకోవాలి అంటే రేషన్‌కార్డు తప్పనిసరి అని ప్రభుత్వం ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 11 ఏళ్లుగా రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో యువత ఎలా దరఖాస్తు చేసుకుంటారని ఆందోళన వ్యక్తం చేశారు. రేషన్ కార్డు నిబంధన తొలగించాలని, లేని పక్షంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రవియాదవ్‌కు అందించారు. కార్యక్రమంలో నిస్సార్, ఎర్రన్న, వినోద్, శివకుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న నాయకులు

అమరచింత: గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో వసతులను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో పని ప్రదేశంలో నీడ, తాగునీటి వసతి, ఆరోగ్య కిట్, ఆశావర్కర్లు ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. భూములు లేని, జాబ్ కార్డు కలిగిన కుటుంబాలందరికీ ఇందిర్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో శంకర్, రాజన్న, మొగిలన్న, చిట్టెమ్మ, సత్యమ్మ పాల్గొన్నారు.

29న తైబజార్ వేలం

కొత్తకోట రూరల్: పట్టణంలో తైబజార్ వేలం ఈనెల 29న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సైదయ్య బుధవారం మీడియాకు తెలిపారు. ఆసక్తి గల వారు ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ కొత్తకోట బ్రాంచ్‌లో చెల్లుబాటు అయ్యేటట్లు రూ.లక్ష ఈనెల 28న సాయంత్రం 5గంటల వరకు డీడీ తీయాలన్నారు. వేలం నిబంధనల ప్రకారం రూ.500 తిరిగిరాని రుసుంను మున్సిపల్ కార్యాలయంలో చెల్లించి, వేలంలో పాల్గొనే వ్యక్తి పాస్‌పొటో, నో డ్యూ సర్టిఫికెట్, ఆధార్ లేదా ఓటర్ ఐడీ కార్డు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వేలం దక్కించుకున్న వారు వేలం మొత్తంలో పావు వంతు డిపాజిట్‌గా మూడు రోజుల్లో జమచేసి, లీజు అగ్రిమెంట్ సబ్ రిజిస్టర్, వనపర్తి వారి ద్వారా పూర్తి చేసి సమర్పించాలన్నారు. ఆస్తి, గృహం యొక్క తనాఖా అగ్రిమెంట్, పోస్టెడ్ చెక్కులు తొమ్మిది ఇవ్వాలని, డిసెంబర్ 5వరకు మిగిలిన సగం 9 వాయిదాలలో చెల్లించాలని పేర్కొన్నారు. పురపాలక చట్టం షరతులను ఉల్లంఘించిన యెడల వేలం రద్దు చేయుటకు గానూ, తిరస్కరించుటకు గానూ కమిషనర్‌కు పూర్తి అధికారం ఉందన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఆత్మకూర్: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది జీకే రాములు, ప్రధానకార్యదర్శిగా ముక్తేశ్వర్, ఉపాధ్యక్షులుగా దివాన్జీ అశోక్‌కుమార్, ఏపీ రాజేందర్, సహాయకార్యదర్శిగా అబ్రహం, కోశాధికారిగా రాంచందర్, గేమ్స్ సెక్రెటరీగా రవీందర్‌రెడ్డి, లైబ్రరీ సెక్రెటరీగా అశోక్‌కుమార్‌గౌడ్ ను నియమించారు. ఎన్నికల అధికారులుగా శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌లింగం, సలహాదారులుగా సీనియర్ న్యాయవాదులు వై తిప్పారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, నారాయణగౌడ్ వ్యవహరించారు.

రేపు శివపార్వతుల కల్యాణోత్సవం

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో వైరాలగుట్టపై వెలసిన శివాలయం వద్ద నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వేడుకకు భక్తులు విశేషంగా తరలివచ్చి తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

బడుగుల పక్షాన పోరాడతాం

కొత్తకోట: వెనుకబడిన కులాల సమాఖ్య (బీసీఎఫ్) మండల అధ్యక్షుడిగా దారమోని గంగాధర్‌ను ఎన్నుకున్నట్లు బీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్నమోని చిన్న రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల హక్కుల కోసం మండలంలో పోరాటం చేశామని ఆయన తెలిపారు. బీసీలకు చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు, బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, ఉద్యోగ, ఉపాధి, విద్యా రంగాల్లో న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి

ఆత్మకూర్: పట్టణంలో ఎంవీ రామన్ విద్యాసంస్థను నెలకొల్పి 35 ఏళ్లుగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని చైర్మన్, మాజీ ఎంపీపీ డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపల్ ఆన్సీ శ్రీధర్ అన్నారు. బుధవారం పాఠశాలలో ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థుల అన్ని సబ్జెక్టులకు సంబంధించి 450 రకాల వస్తువులను ప్రదర్శించారు.



మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



వనపర్తిలో ఇఫ్తార్‌లో పాల్గొన్న మాజీ మంత్రి, మాజీ ఎంపీ



ఖిల్లాఘనపురంలో..

వనపర్తి: హిందూ, ముస్లింలు ఉగాది, రంజాన్ పండుగలను సోదరభావంతో జరుపుకోవాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని అన్ని మసీదులలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఇఫ్తార్‌విందులో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ముస్లింలకు బుధవారం మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆయన గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులతో ఇఫ్తార్ ఏర్పాటు చేయించి ఫోన్‌లో ముస్లింతో మాట్లాడి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, నాయకులు బాలస్వామి, బాలాంజనేయులుగౌడ్, బుచ్చిబాబుగౌడ్, గొడుగు సత్యం, అంజనేయులుగౌడ్, చిన్న అంజనేయులు గౌడు, ప్రతాప్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్షయ నిర్ధారణ పరీక్షలు



అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పాన్‌గల్: క్షయ వ్యాధి నిర్మూలన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో పరీక్షలు కొనసాగుతున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్ఓ రామయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో అనుమానితులకు క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు నిశ్చయ్ పోషణ్ యోజన, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద పౌష్టికాహారం తీసుకోవడానికి నెలకు రూ.1000 అందజేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కోఆర్డినేటర్ ఖాజా, ఎక్స్‌రే టెక్నీషియన్ సురేందర్, వైద్య సిబ్బంది సతీష్‌కుమార్, నర్సమ్మ, నాగేశ్వరి, లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి



గాంధీనగర్‌లో ప్రజలతో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

వనపర్తి రూరల్: సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం పట్టణంలోని 18 వార్డులో ఇంటింటి సర్వే చేసి, కాలనీ నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు. వార్డులో పైప్‌లైన్లు, విద్యుత్ లోవోల్టేజీ, డ్రెయినేజీ, ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులు, శ్మశానవాటిక స్థలం, పింఛన్ మంజూరు చేయించాలని, సీసీరోడ్లు, జీరో బిల్లులు, వంటగ్యాస్ సిలిండర్ సబ్సిడీ డబ్బులు రావడం లేదని ప్రజలు సీపీఎం నాయకులకు వివరించారు. వార్డులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం గాంధీనగర్‌శాఖ కార్యదర్శి గంధం మదన్ అధికారులను కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి, బాలస్వామి, రత్నయ్య, బాలరాజు, మన్యం తదితరులు పాల్గొన్నారు.


పైప్‌లైన్లు సరిచేయాలి



వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న అఖిలపక్ష నాయకులు

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, తాగునీటి పైపులైన్ల పేరుతో కాంట్రాక్టర్ విచ్చలవిడిగా రోడ్లన్నీ ధ్వంసం చేశారని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో అఖిలపక్షం ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీవాసులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయా కాలనీలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ధ్వంసమైన పైప్‌లైన్లను సరిచేయాలన్నారు. పైపులైన్ కోసం తవ్విన గుంతలో పడిన గంధం సంతోషమ్మకు కాలు విరిగిందని, బాధితురాలికి తగిన పరిహారం చెల్లించాలని కోరారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే మున్సిపాలిటీ, కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, గొనికాడి యాదయ్య, గంధం భరత్ కుమార్, కొత్తగొల్ల శంకర్, గంధం కొండన్న, గంధం హన్మంత్, సుందర్ రాజ్, నరసింహ, శివన్న, కురుమూర్తి, కాలనీ ప్రజలు తదితరులు ఉన్నారు.

పోలేరమ్మ బోనాలు



వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకంలో భాగంగా మంగళవారం రాత్రి గ్రామస్తులు పోలేరమ్మకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తులు నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నాటక ప్రదర్శనకు సహకరించిన దాతలు, పాత్రదారులు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, మాజీ సర్పంచ్ సిద్దయ్య, యాదగిరిగౌడ్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, దత్తాత్రేయరెడ్డి, లక్ష్మారెడ్డి, నాగేంద్రం, యాదవరెడ్డి, బాలరాజు, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.